క్లుప్తంగా

కొమరవోలు భజన బృందం ఏర్పాటు



రామాలయంలో భజన బృందంగా ఏర్పాటైన మహిళలు

రోలుగుంట: కొమరవోలు ఇలవేల్పు గ్రామ తల్లి పేరున గ్రామానికి చెందిన 60 మంది మహిళలు భజన బృందంగా ఏర్పడ్డారు. ఆధ్యాత్మికత కళలకు మారుపేరైన గ్రామానికి భజన బృందం లోటును మహిళలు తీర్చారని సర్పంచ్ గొర్లె రమణమ్మ, ఎంపీటీసీ రామన్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా భజన ప్రదర్శనలో గుర్తింపు తీసుకొస్తామని బృందం తెలిపింది.

మామిడిలో అంతర పంటగా టమాటా



మర్రివలసలో టమాటా సాగు

కె.కోటపాడు: మండలంలోని మెట్ట గ్రామాల్లో రైతులు అంతర పంటల సాగు విధానంపై ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా రైతులు అధిక విస్తీర్ణంలో మామిడి సాగు చేపడుతున్నారు. ఈ పంట ఖాళీ ప్రదేశాల్లో అంతర పంటగా కూరగాయలతోపాటు ఆకుకూరలను సాగు చేస్తున్నారు. తక్కువ కాల వ్యవధిలో, తక్కువ పెట్టుబడితో సాగయ్యే టమాటా పంటను పాతవలస, గొట్లాం, సూదివలస, శృంగవరం, మర్రివలస ప్రాంతాల్లో 50 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మామిడితోపాటు అంతర పంటగా టమాటా సాగు చేయడం వల్ల అదనపు ఆదాయాన్ని సాధిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

నూతన ఆలయాల ప్రారంభోత్సవానికి ఆహ్వానం

మాడుగుల రూరల్: కె.జె.పురంలో ఇటీవల పునర్నిర్మించిన మరిడిమాంబ ఆలయంతో పాటు కాళ్ల వారి కళ్లాల వద్ద నూతనంగా నిర్మించిన మహలక్ష్మిమ్మ, ఎరుకుమ్మ ఆలయాల ప్రారంభోత్సవానికి హాజరు కావాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును కోరారు. ఆదివారం ఆయా ఆలయాల చైర్మన్లు, గ్రామ పెద్దలు తారువలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 26న ఆలయాలు ప్రారంభిస్తామన్నారు. సర్పంచ్ జామి రమణబాబు, నాయకులు ఆడారి కన్నారావు, కాళ్ల అప్పలనాయుడు, మళ్ల కన్నబాబు, భీశెట్టి జగ్గప్పారావు, మాలినాయుడు, కాళ్ల అమ్మతల్లి నాయుడు మాస్టరు, అచ్చిమినాయుడు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు ఫ్యాన్లు వితరణ



ఫ్యాన్లు అందజేస్తున్న లైన్స్‌క్లబ్ ప్రతినిధులు

నర్సీపట్నం: నడిపాలెం ఏకోపాధ్యాయ ప్రభుత్వ పాఠశాలకు స్టీల్ సిటీ లైన్స్‌క్లబ్ వారు సీలింగ్ ఫ్యాన్లు బహూకరించారు. నర్సీపట్నంలో జరిగిన లైన్స్ జిల్లా మూడో కేబినెట్ మీటింగ్‌లో భాగంగా సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కొయ్యూరు మండలం నడిపాలెం ఏకోపాధ్యాయ పాఠశాలకు లైన్ జోన్ చైర్‌పర్సన్ పాలపర్తి సత్యానందం, ఆర్‌సీ సత్యనారాయణరాజు క్లబ్ ద్వారా ఫ్యాన్లు అందజేశారు. జిల్లా నాయకులు ఉషారాజు, శర్మజానకీదేవి, రాఘవేంద్రరావు, బుచ్చిరాజు, ఎం.ఎస్.ఎస్.మూర్తి, జగదీష్ పాల్గొన్నారు.

స్నేహ సౌభ్రాతృత్వానికి తీర్థాలు

మాడుగుల రూరల్: గ్రామాల్లో నిర్వహించే గ్రామ దేవతల పండగలు, తీర్థాలతో ప్రజల్లో స్నేహ సౌభ్రాతృత్వం వెల్లి విరుస్తోందని ప్రభుత్వ విప్, చోడవరం శాసనసభ్యుడు కరణం ధర్మశ్రీ పేర్కొన్నారు. కె.జె.పురంలో బుద్దా సూరిబాబు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం మోదమాంబ ఓడ్డు పండగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మశ్రీ పాల్గొని మాట్లాడారు. సంక్రాంతి పండగ తర్వాత గ్రామ తీర్థాలు శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రిలిమినరీ పరీక్షకు 199 మంది గైర్హాజరు

కానిస్టేబుల్ అర్హత పరీక్షకు 3,106 మంది హాజరు



చోడవరంలో పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు పర్యవేక్షిస్తున్న సీఐ శ్రీనివాసరావు



అభ్యర్థులను డీఎస్పీ పర్యవేక్షణలో తనిఖీలు చేస్తున్న సిబ్బంది

మాకవరపాలెం: కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నిర్వహించిన అర్హత పరీక్షకు 1,317 మంది హాజరయ్యారు. తామరంలోని అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం కానిస్టేబుల్ అర్హత పరీక్ష నిర్వహించారు. ఈ నేపథ్యంలో 1,400 మంది పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేశారు. వీరిలో 1,317 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ మోహన్‌రావు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన ఈ పరీక్ష రాసేందుకు ఉదయం 9 గంటల నుంచే అభ్యర్థులు కేంద్రానికి చేరుకున్నారు. వీరిని నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్ కుమార్ పర్యవేక్షణలో పోలీసులు తనిఖీలు చేసి లోపలికి అనుమతించారు. రూరల్ సీఐ రమణయ్య, ఎస్‌ఐలు రామకృష్ణారావు, రామారావు బందోబస్తు నిర్వహించారు.

చోడవరంలో 116 మంది అభ్యర్థులు గైర్హాజరు

చోడవరం రూరల్: పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలు ఆదివారం చోడవరంలో ప్రశాంతంగా నిర్వహించారు. ఇక్కడ ఐదు పరీక్ష కేంద్రాల్లో 1,810 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 1,699 మంది హాజరయ్యారు. 116 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. సీఐ బి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు గస్తీ ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు.

1 నుంచి 5 వరకు దేవీతల్లి తీర్థం



ఆలయంలో సమావేశమైన గ్రామ పెద్దలు

దేవరాపల్లి: స్థానిక ప్రజల ఆరాధ్య దైవం ఉమామహేశ్వరి దేవి (దేవీతల్లి) తీర్థం వచ్చే నెల 1 నుంచి 5వ తేదీ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈ మేరకు ఆలయంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఐదు రోజులు పాటు జరిగే తీర్థం సందర్భంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుపై చర్చించారు. ఆఖరి రోజు 5న భారీ సంఖ్యలో హాజరయ్యే భక్తులకు ఇబ్బందులు లేకుండా చేయాల్సిన ఏర్పాట్లుపై సైతం సమాలోచనలు చేశారు. సమావేశంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, కల్లుగీత డైరెక్టర్ సిమ్మ అప్పన్న, వరదపురెడ్డి లలితానాయుడు, ఎల్లేటి కరుణాకరరావు, ఆలయ ధర్మకర్త లలితాప్రసాద్, గండిపడాల అప్పలరాజు, గుండు రాంబాబు, వేచలపు అప్పలనాయుడు, పేరునాయుడు, వాలేటి నాగరాజు, కె.వి.రమణ పాల్గొన్నారు.

నేడు సుభాష్ చంద్రబోస్ తీర్థం

మాడుగుల రూరల్: కె.జె.పురంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా సోమవారం తీర్థం నిర్వహిస్తున్నట్లు నేతాజీ సోల్జర్స్ (2007-2008) బ్యాచ్ విద్యార్థులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఇక్కడ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ఉదయం జెండా వందనం, దేశభక్తి గీతాలు ఆలాపన ఉంటుందన్నారు. అనంతరం సాయంత్రం ముగ్గులు, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి సీఎం పెద్దపీట

• డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



గరిశింగిలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: గిరిజనుల సంక్షేమ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గరిశింగి గ్రామ సచివాలయం పరిధిలోని గరిశింగి, కొత్తూరు, డొర్రి చెరువు, కించుమండ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటికి వెళ్లి మూడున్నరేళ్లలో అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గరిశింగిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఎస్సీ కాలనీ సహా పలు వీధుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పలు చోట్ల ఇళ్లకు అనుకొని విద్యుత్ స్తంభాలను, తీగలను సరి చేయాలని ఎలక్ట్రికల్ అధికారులకు సూచించారు. సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారికి లోపాలను సరి చేసి అందించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఎంపీపీ స్కూల్‌లో రూ. 22.75 లక్షలతో చేపట్టిన నాడు-నేడు పనులను ప్రారంభించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కొత్తూరు, డొర్రి చెరువు గ్రామాల్లో దశాబ్దాలుగా వేధిస్తున్న రోడ్డు సమస్యలను పరిష్కరించిన డిప్యూటీ సీఎంకు ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాలకు రోడ్లు, మంచినీటి సదుపాయం కల్పించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గరిశింగి నుంచి వయా శివారు గిరిజన గ్రామాలు కొత్తూరు మీదుగా డొర్రి చెరువు వరకు రూ. 1.12 లక్షలతో 2.3 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మించామన్నారు. జలజీవన్ మిషన్‌లో గరిశింగికి రూ. 65 లక్షలు మంజూరు చేశామని, ఈ నిధులతో 60 వేల లీటర్ల మంచినీటి ట్యాంక్ నిర్మించి ప్రతీ ఇంటికి కుళాయి నీరు సరఫరా చేస్తామన్నారు. కొత్తూరుకు రూ. 8.50 లక్షలు, డొర్రి చెరువుకు రూ. 8.5 లక్షలు మంజూరు చేశామని, ఈ నిధులుతో రెండు గ్రామాలలో 10 వేలు లీటర్ల మంచినీటి ట్యాంక్‌లు నిర్మించి ప్రతీ ఇంటికి కుళాయి నీరు సరఫరా చేస్తామన్నారు. గిరిజనుల ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు సైతం తమ ప్రభుత్వ హయాంలోనే అందజేశామన్నారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి తానెప్పుడు సిద్ధంగా ఉంటానని భరోసా కల్పించారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, సర్పంచ్ గూడెపు రాము, ఎంపీటీసీ కోలా గోపి, దువ్వార చిలుకు, గూడెపు అప్పారావు, గూడెపు మోహన్, సర్పంచ్‌లు చింతల సత్య వెంకటరమణ, దాసరి సంతోష్‌కుమార్, కాటిపాం పెదనాయుడు, ఎంపీటీసీ గొరపల్లి భాష్కరరావు, కిల్లాన శ్రీను, నాయకుడు బుగత వెంకటరమణ పాల్గొన్నారు.

సీసీరోడ్ల పనులు ప్రారంభం



భూమిపూజ చేసి పనులు ప్రారంభించిన సర్పంచ్ సంధ్య

రోలుగుంట: నిండుగొండలోని రెండు వీధుల్లో సీసీరోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ రూ. 2 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో చేసే పనులకు సర్పంచ్ శెట్టి సంధ్య ఆదివారం భూమిపూజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకెళ్లగా, దీనిపై స్పందించిన ఆయన రెండు రోడ్లు మంజూరు చేశారన్నారు. గాలి నూకాలతల్లి ఇంటి నుంచి అప్పలనాయుడు ఇంటి వరకూ, లెక్కల జోగినాయుడు ఇంటి నుంచి వరహాలనాయుడు ఇంటి వరకూ ఈ రోడ్లు పూర్తయితే తమ సమస్య తీరుతుందని వీధివాసులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీకి, సర్పంచ్‌తోపాటు మాజీ ఎంపీపీ సత్యనారాయణమూర్తి, మాజీ ఎంపీటీసీ వెంకటరాజారావు కృతజ్ఞతలు తెలిపారు.

అయ్యన్న మాట్లాడేవి నీతులా?

టీడీపీ నేతలకు ఎంపీపీ ప్రశ్న



మాట్లాడుతున్న ఎంపీపీ సత్యనారాయణ

మాకవరపాలెం: మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ప్రెస్ మీట్లు పెట్టి ప్రవచనాలు, నీతులు మాట్లాడుతున్నారా అని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ టీడీపీ నేతలను ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్‌పై టీడీపీ నేతలు చేసిన విమర్శలను ఖండించారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గణేష్ వన్ టైం కాదని.. లైఫ్ టైం ఎమ్మెల్యేగా ఉంటారన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని బదులిచ్చారు. 35 ఏళ్లలో చేయలేని అభివృద్ధిని చేసి చూపించారన్నారు. ప్రజల్లో వైఎస్సార్‌సీపీకి వస్తున్న ఆదరణ చూడలేకే అయ్యన్న లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పెట్ల భద్రాచలం, బొడ్డు గోవిందరావు పాల్గొన్నారు.

అయ్యన్నను విమర్శించే అర్హత లేదు

అయ్యన్నను విమర్శించే అర్హత ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్‌కు లేదని టీడీపీ మండలాధ్యక్షుడు ఆర్.వై.పాత్రుడు, కార్యదర్శి వెంకటరమణ తెలిపారు. ఆదివారం తామరంలో వారు మాట్లాడుతూ అయ్యన్నపై ఎమ్మెల్యే చేసిన విమర్శలను ఖండించారు.

జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందెం విజేత ఎం.కొత్తపల్లి



పైడిమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు రొంగలి వెంకటరావు

దేవరాపల్లి: కొత్తపెంటలో పైడిమాంబ అమ్మవారి తీర్థం పురస్కరించుకొని ఆదివారం జిల్లా స్థాయి ఎడ్ల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు విచ్చేసిన పది ఎడ్ల బళ్ల మధ్య పోటీలు హోరా హోరీగా సాగాయి. ఇందులో విజేతగా ఎం.కొత్తపల్లికి చెందిన నంబారు గాయిత్రి ఎడ్లు నిలిచాయి. ఎం. కోటపాడు పాచిల నాగరాజు ఎడ్లు ద్వితీయ, నర్సయ్యపేట ముమ్మిన రామకృష్ణ ఎడ్లు తృతీయ స్థానాలను దక్కించుకున్నాయి. లక్కవరం మోదమాంబ ఎడ్లు నాల్గు, మంగళాపురం సిద్ధివినాయక ఎడ్లు ఐదు, కొత్తపెంట రొంగలి రవితేజ ఎడ్లు ఆరో స్థానాల్లో నిలిచాయి. వీరికి రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు, వెయ్యి రూపాయల చొప్పున నగదు బహుమతులను సర్పంచ్ రొంగలి వెంకటరావు, దాతలు, గ్రామ పెద్దలు ప్రదానం చేశారు. మాజీ సర్పంచ్ రొంగలి శంకరరావు, రెడ్డి పైడింనాయుడు తదితర గ్రామ పెద్దలు ఉన్నారు.

జిల్లా స్థాయి ఎడ్ల బండ్ల పోటీలు నేడు

ములకలాపల్లిలో పైడిమాంబ, ముత్యమాంబ, మరిడిమాంబ అమ్మవార్లు, అచ్చియ్యమ్మ పేరంటాలు తీర్థం పురస్కరించుకొని సోమవారం జిల్లా స్థాయి ఎడ్ల పోటీలను నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ గొర్లె అన్నపూర్ణ, ఎంపీటీసీ మజ్జి దేవి తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు రూ.15 వేలు, రూ. 12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ. 2వేలు, వెయ్యి రూపాయల చొప్పున బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు.

నేడు ఎడ్ల పరుగు పందెం

బుచ్చెయ్యపేట: ఆర్. శివరాంపురంలో సీతారాములవారి తీర్థం సందర్భంగా సోమవారం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందెం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ నమ్మి నీరజ అప్పలరాజు తెలిపారు. వీటితోపాటు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తి గల వారు పోటీల్లో పాల్గొనాలని కోరారు.

నేడు సీతారామాంజనేయ తీర్థం

చీడికాడ: మంచాలలో సోమవారం జరగనున్న సీతారామాంజనేయ స్వామివారి తీర్థం గోడపత్రికను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు విడుదల చేశారు. ఆదివారం తారువ క్యాంపు కార్యాలయంలో మంచాల గ్రామ వైఎస్సార్‌సీపీ నేతలు కసిరెడ్డి రామకృష్ణ, పాటూరి రమణ తదితరులు బూడిని కలిసి ఆహ్వానించారు.

నేడు సామూహిక కుంకుమ పూజలు

మాడుగుల: స్థానిక వాసవీ మాత ఆలయంలో సోమవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ సభ్యులె తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి క్షీరాభిషేకం, అనంతరం సామూహిక కుంకుమ పూజలు, సాయంకాలం 3 గంటలకు లలితా పారాయణం, 6 గంటలకు ఊరేగింపు, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని కోరారు.

రూ. 75 లక్షలతో అదనపు భవనాల నిర్మాణం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ అప్పారావు

చోడవరం: గాంధీ గ్రామం (చోడవరం) గవర్నమెంటు హైస్కూల్‌లో నాడు నేడు పనులు ఆదివారం చేపట్టారు. రెండు విడతల్లో రూ. 75 లక్షలు ప్రభుత్వం కేటాయించింది. ఇందులో భాగంగా పాఠశాలకు మూడు తరగతి గదులు మంజూరు కావడంతో భవనాల నిర్మాణానికి కాంక్రీటు పనులను గ్రామ సర్పంచ్ గాడి అప్పారావు ప్రారంభించారు. హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ దాడి జగదీష్, ఇంజినీరింగ్ సిబ్బంది ఈ పనులు పర్యవేక్షించారు. పనులు వేగంగా పూర్తిచేసి భవనాలను తొందగా వినియోగంలోకి తీసుకురావాలని సర్పంచ్ కోరారు.

చిరుధాన్యాల సదస్సు రేపు

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 24న అంతర్జాతీయ చిరుధాన్యాల సదస్సు నిర్వహించనున్నట్టు శారదా వ్యాలీ డెవలప్‌మెంట్ కార్యదర్శి జోగినాయుడు తెలిపారు. నాబార్డు అధికారులు, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ శాస్త్రవేత్తలు, వర్సిటీ శాస్త్రవేత్తలు హాజరుకానున్నట్టు పేర్కొన్నారు.

మంచు దుప్పటిలో గ్రామాలు



ఉదయం 7 గంటల సమయంలో లైట్లు వేసుకుని ప్రయాణాలు

కె.కోటపాడు: శీతాకాలం కావడంతోపాటు ఉదయం పూట పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 7 గంటల వరకూ రోడ్లను మంచు కమ్మేస్తుండటంతో వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలను సాగించాల్సి వస్తోంది. చలి తీవ్రత పెరగడంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆనందపురం, పాతవలస, మర్రివలస, కె.కోటపాడు, చౌడువాడ, గొందుపాలెం, వారాడ, చిరికివానిపాలెం గ్రామాల్లో ఆదివారం పొగమంచు తీవ్రంగా కురిసింది. పొగమంచు కారణంగా మామిడి పూతకు నష్టం కలిగే పరిస్థితులు ఉన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

• అమర్‌నాథ్‌కు జన్మదిన శుభాకాంక్షలు



విశాఖ నగరంలోని మిందిలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

ముగిసిన గౌరీపరమేశ్వరుల ఉత్సవం



బాణసంచా విన్యాసాలు



ఆర్కెస్ట్రాలో పాటలు పాడుతున్న సింగర్లు

అనకాపల్లిటౌన్ : స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల మహోత్సవం శనివారం అర్ధరాత్రి దాటిన వరకు జరిగి, ఘనంగా ముగిసింది. అమ్మవారి ఆలయానికి భక్తులు బారులు తీరారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతి కార్యక్రమాలు జాతరకు వచ్చిన ప్రజలను ఆకట్టుకున్నాయి. శారదానది వంతెన నుంచి పెరుగులబజారు కూడలి వరకు ప్రధాన రహదారి జనంతో కిక్కిరిసింది. ఎన్టీఆర్ క్రీడామైదానంలో మందుగుండు సీతారామయ్య బాణసంచా విన్యాసాలు ఆకర్షించాయి. పట్టణ సీఐ దాడి మోహన్ ఆధ్వర్యంలో భారీగా పోలీసు బలగాలు బందోబస్తు నిర్వహించాయి.

గంగాధర్‌కు అభినందనలు



గంగాధర్‌ను సత్కరిస్తున్న జానకిరామరాజు

అనకాపల్లిటౌన్ : 21 ఏళ్లలో చార్టెట్ అకౌంట్స్ పూర్తి చేసిన స్థానిక విజయరామరాజుపేట నివాసి అప్పికొండ గంగాధర్‌ను వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు అభినందించారు. 82వ వార్డులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో గంగాధర్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అప్పికొండ వెంకటరావు, వీధిపెద్దలు పాల్గొన్నారు.

'బెల్లంమార్కెట్' అధ్యక్షునిగా పొలిమేర



నూతన కార్యవర్గం

అనకాపల్లిటౌన్ : ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ కార్మిక సంఘం అధ్యక్షునిగా పొలిమేర శివ అప్పారావు(మనీ)ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ ఆవరణలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో కార్యదర్శిగా బుద్ద రాము, కోశాధికారిగా పొలిమేర వెంకట అప్పారావు, సహాయ ఉపాధ్యక్షునిగా కాండ్రేగుల నూక అప్పారావు, సహాయ కార్యదర్శిగా గొర్లె కుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా గరిక వెంకటరావు, విల్లూరి రమణబాబు, కొణతాల త్రినాథ్ వ్యవహరించారు.

ఆలయ నిర్మాణానికి రూ.20 వేల విరాళం

కె.కోటపాడు: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో గ్రామాల్లో ప్రశాంత నెలకొంటుందని డేన్ ఫౌండేషన్ అధినేత దొగ్గ అచ్చింనాయుడు తెలిపారు. ఉగ్గినవలసలో వీరాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం ఆయన రూ.20 వేలు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. పొడుగుపాలెం గ్రామానికి చెందిన దాత అచ్చింనాయుడు కృతజ్ఞతలు తెలిపారు. లెక్కల నాయుడు, లెక్కల దేముడుబాబు, బొడ్డు మహేశ్వరరావు, బోని సత్యనారాయణ, గేదెల రమణ, సూర్యనారాయణ మాస్టరు, ఫౌండేషన్ ప్రతినిధులు కిర్ల వెంకటరమణ, చిరికి జగదీశ్వరావు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న డేన్ ఫౌండేషన్ సభ్యులు

కోడిపందాల్లో నలుగురి అరెస్ట్

అనకాపల్లిటౌన్ : అక్కిరెడ్డిపాలెం గ్రామ శివారున ఆదివారం కోడి పందాలాడుతున్న శిబిరంపై దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్ఐ నరసింగరావు చెప్పారు. వారి నుంచి మూడు కోళ్లు, రూ.400 నగదును స్వాధీనపరచుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా పేకాట, కోడి పందాలు తదితర జూదంలో పాల్గొన్నా.. ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కశింకోట: జి.భీమవరం గ్రామ శివారు మామిడి తోటలో ఆదివారం కోడి పందాలు ఆడుతుండగా తమ సిబ్బందితో దాడి చేసి ఇద్దరిని పట్టుని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎ. ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఈ దాడిలో వారి నుంచి రూ.1,130 నగదు, రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.